కేబినెట్ నిర్ణయం హర్షణీయం

బొౌద్ధనగర్: జమిలి ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యమైన వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లుపై కీలక నిర్ణయం తీసుకుందని, త్వరలోనే శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంట్ ముందు ప్రవేశపెట్టనుండటం హర్షణీయమన్నారు. ఈ ఎన్నికల బిల్లు దేశ వ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే దిశగా ముందుకు వెళుతోందని, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ సమగ్ర నివేదికను కేంద్రానికి అందజేసిందన్నారు.

సంచాలన్ భవన్ వద్ద కార్మికుల సంబరాలు


వేడుకల్లో పాల్గొన్న మజ్దూర్ యూనియన్ నాయకులు

అడ్డగుట్ట: రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు ఎర్ర జెండాకు పట్టం కట్టడం హర్షణీయమని ఎస్ అండ్ టీ ఎలక్ట్రికల్ బ్రాంచ్ చైర్మన్ ఎస్కే ఖాదర్ అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఖాదర్ మాట్లాడుతూ రైల్వే కార్మికుల పక్షాన నిలబడుతూ నిరంతరం సమస్యలపై పోరాడే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌కు పట్టం కట్టారన్నారు. భవిష్యత్తులో 8వ పే కమిషన్, పెండింగ్‌లో ఉన్న అన్ని అలవెన్స్‌లతో పాటు న్యాయపరమైన డిమాండ్ల సాధనకు మరిన్ని పోరాటాలు చేస్తూ కార్మికులకు అండగా ఉంటామన్నారు. బ్రాంచ్ సెక్రటరీ వినాయక రావు, ఆఫీస్ బేరర్లు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సామల హేమ గురువారం ప్రారంభించారు. స్థానికుల అభ్యర్థన మేరకు రూ. 14 లక్షల వ్యయంతో ఏడాదిన్నర క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేయగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, నేటికి కార్యరూపం దాల్చిందని వివరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన నిర్మాణ పనులుపూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ ప్రతినిధులు యాదగిరి, గౌతమ్, శంకర్, లక్ష్మీ, లలిత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు పరిశీలించిన కార్పొరేటర్


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బొౌద్ధనగర్: డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ కంది శైలజ ఆదేశించారు. డివిజన్‌లోని రోడ్ నెంబర్ 6లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ శైలజ గురువారం పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. రూ. 7 లక్షల నిధులతో ప్రారంభించిన పైప్‌లైన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి వీలైనంత తొందరగా పూర్తి చేయాలని చెప్పారు.

కుట్టు మిషన్ల పంపిణీ


సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

లాలాపేట: కుట్టు శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని తెలంగాణ ఫ్రాన్సీలియన్ సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు దాదాపు 120 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇందులో పేద, మధ్యతరగతికి చెందిన 67 మంది మహిళలకు గురువారం శాంతినగర్‌లో సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, ఫాదర్ జెడ్డూ జోషఫ్, విజయ్ శేఖర్, డైరెక్టర్ ఫాదర్ రవిప్రశాంత్ తదితరులున్నారు.

ఓయూలో భూ భౌతిక శాస్త్రజ్ఞుల సమ్మేళనం


సావనీరును ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భూ భౌతిక శాస్త్రజ్ఞుల 46వ వార్షిక సమ్మేళనం ప్రారంభమైంది. గురువారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన సదస్సు, ఎగ్జిబిషన్‌కు ఏఈజీ ఉపాధ్యక్షులు ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా పద్మశ్రీ ప్రొ.హర్ష కె గుప్తా ప్రారంభించారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా 300 మంది సైంటిస్టులు హాజరుకాగా 50 పరిశోధన పత్రాలు ప్రదర్శించినట్లు ప్రొ.వీరయ్య తెలిపారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, కార్యదర్శి వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బన్సీలాల్‌పేట్: గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన మేరకు.. ఓ వ్యక్తి మృతదేహం గాంధీ ఆస్పత్రి సమీపంలోని మెట్రో స్టేషన్ ఫుట్‌పాత్‌పై పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తాలుకు వ్యక్తులు, కుటుంబీకులు ఎవరైనా ఉంటే గాంధీనగర్ పోలీసులను సంప్రదించాలని (87126 61248) పేర్కొన్నారు.

ఆనందం.. ఆరోగ్యం..

ఆకట్టుకుంటున్న జెక్‌కాలనీ మహాత్మాగాంధీ పార్కు






మహాత్మాగాంధీ పార్కు

సనత్‌నగర్: ఒకప్పుడు ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా ముళ్లపొదలు..బండ రాళ్లు కనిపించేవి.. కానీ ఇప్పుడు అదే స్థలం ఇప్పుడు కనువిందు చేస్తోంది.. ఒకవైపు ఆహ్లాదాన్ని పంచే సుందరవనం.. ఇంకోవైపు ఒంటరి భావాన్ని తొలగించే సీనియర్ సిటిజన్స్ ముచ్చట్ల అడ్డా.. మరోవైపు వాకింగ్, యోగ శిక్షణకు వేదికగా మారిన ఆరోగ్య ప్రసాదిని. కరాటే శిక్షణకు చిరునామా.. ఇలా ఆ పార్కు బహు ప్రయోజనాలను అందిస్తోంది. అదే జెక్‌కాలనీ మహాత్మాగాంధీ పార్కు... కాలనీ అసోసియేషన్ నాయకులు, సభ్యులు అబ్బురుపరిచేలా దీనిని తీర్చిదిద్దారు.

ఆహ్లాదం..ఆరోగ్యం..

గడిచిన ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నిధులు మంజూరు చేయించి పార్కు ఇక్కడి పార్కు అభివద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆ తర్వాత అసోసియేషన్ సభ్యులు ఒకొక్కటిగా పార్కులో అవసరాలను సమకూర్చుకుంటూవచ్చారు. మహాత్మాగాంధీ పార్కు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందిస్తోంది. చుట్టూ గ్రీనరీ, మధ్యమధ్యలో ఏపుగా పెరిగిన చెట్లు, ఆ చెట్లకు అందమైన రంగురంగుల పెయింటింగ్..వాటి మధ్య సేదదీరేందుకు చూడముచ్చటైన బెంచీలు..పార్కులో ఆకట్టుకునేలా హట్ (గుడిసె) మాదిరిగా చేసిన నిర్మాణం..అందులో కూర్చోవడానికి వీలుగా బెంచీలు..వేసవిలో సైతం చల్లదనాన్ని అందించేలా వటవృక్షం చెంతన సీనియర్ సిటిజన్స్ ఊసుల అడ్డా..ప్రతిదీ వైవిధ్యమే..అవన్నీ చూడడానికి రెండు కళ్లు చాలవేమో అన్నట్లుగా పార్కు రూపుదిద్దుకుంది. పార్కు స్థలం తక్కువే అయినా చూడముచ్చటగా తీర్చిదిద్దారు. అలాగే చిన్న చిన్న సమావేశాలు, కలసికట్టుగా అపార్ట్‌మెంట్ల వారీగా వనభోజనాలు చేసుకునేందుకు పార్కు అనువుగా ఉంది. కాలనీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ కూడా ఉన్నతంగా కొనసాగుతుంది.


పార్కులో సీనియర్ సిటిజన్స్

జిమ్ పరికరాలను ఏర్పాటు చేయాలని కోరాం



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డిల సహకారంతో పార్కులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వాకర్లు, సందర్శకులు, యోగ, కరాటే శిక్షకులతో ఉదయం, సాయంత్రం పార్కు ఎంతో కోలాహలంగా మారింది. సీనియర్ సిటిజన్స్ సలువుగా వ్యాయామం చేసుకునే విధంగా జిమ్ పరికరాలను ఏర్పాటుచేయాలని కోరాం.
– మల్లు ప్రసాద్, కాలనీ అధ్యక్షుడు..

మొదట్లో ఎందుకు ఇల్లు కొన్నామా అనిపించింది



అప్పట్లో పార్కు స్థలంలో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులను చూసి ఎందుకు ఇక్కడ ఇల్లు కొన్నామా అనిపించింది. ఇప్పుడు ఇంట్లో నుంచి బాల్కనీలోకి వస్తే ఆహ్లాదకరమైన పార్కు సందర్శనమిస్తోంది. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని ఈ పార్కు అందిస్తోంది.
– శారద, క్లాసిక్ ఆర్కేడ్

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా 15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 21, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 23, పందిరి బీర 38, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 23, గుండుబీన్స్ 48, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 35, దోసకాయ 18, బీట్‌రూట్ 37, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 35, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీదత్తాత్రేయస్వామి

సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీదత్తాత్రేయ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణతో పాటు స్వామివారికి అభిషేకం, అర్చన, హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు జయంతి ఉత్సవాలను వైభవంగా జరుపుతున్నారు.

మజ్దూర్ యూనియన్ విజయోత్సవం


సికింద్రాబాద్‌లో విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో విజయం

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వేలో జరిగిన రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయఢంకా మోగించిందని యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం సికింద్రాబాద్‌లోని మజ్దూర్ యూనియన్ కేంద్ర కార్యాలయం నుంచి రైల్ నిర్మాన్ భవన్, హైద్రాబాద్ భవన్, సంచాలన్ భవన్‌ల మీదుగా రైలు నిలయం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం, శంకర్ రావు మాట్లాడుతూ రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో తమ పక్షాన నిలబడి ఓట్లు వేసిన ప్రతీ రైల్వే ఉద్యోగి, కార్మికుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు, హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. అదే విధంగా ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం విషయంలో ఎంత దూరమైనా వెళ్తమని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, నాయకులు ఉదయ్ భాస్కర్, సరోజిని రెడ్డి, రవీందర్, ఖాజబాబ, సంజీవయ్య, స్వామి, రామ్మోహన్, నాగలక్ష్మి, యుగంధర్, వినయ్, అర్జున్, సునీల్, రాజేందర్, రాకేష్, రాజేష్, రంజిత్, సరిత తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టుకు గాంధీ వైద్య విద్యార్థుల ఎంపిక

గాంధీఆస్పత్రి: కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వాలీబాల్ పురుషుల జట్టులో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ విద్యార్థులు స్థానం సంపాదించారు. యూనివర్సిటీ పరిధిలోని పలు కాలేజీలకు చెందిన మొత్తం 12 మంది సభ్యులు ఎంపిక కాగా ఐదుగురు గాంధీ మెడికల్ విద్యార్థులే. కేరళ తిరువనంతపురంలో ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొంటుంది. జీవన్, యువరాజ్, కిషోర్, అరుణ్, శ్రీకర్ వాలీబాల్ జట్టుకు ఎంపిక అయ్యారని గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర తెలిపారు. వాలీబాల్ జట్టుకు ఎంపికైన క్రీడకారులకు గురువారం అభినందించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాంధీ వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు, డాక్టర్ వినోద్, సెలక్షన్ కమిటీ ప్రతినిధులు సందీప్ కుమార్, వేణు, ఖాదీర్, గాంధీ ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ వేణు, శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన వాలీబాల్ జట్టు క్రీడాకారులతో సెలక్షన్ కమిటీ ప్రతినిధులు

ఈవీ వాహనాల వినియోగం పెరగాలి

ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ ప్యూర్ ఈవీ తాడ్‌బంద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహనాల షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వల్ల కాలుష్యం చాలావరకు తగ్గుతుందన్నారు. ఈ మేరకు వాహనదారుల్లో అవగాహన పెంచి, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేలా చూడాలన్నారు. ప్యూర్ ఈవీ వ్యవస్థాపకులు, సీఈఓ రోహిత్ వదేరా మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఈప్లూటో, ఈట్రాన్స్, ఎకోడ్రిఫ్ట్, ఈట్రిస్ట్ వేరియెంట్‌లలో వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 2018లో ప్రారంభించిన తమ సంస్థకు ప్రతీయేటా ఆదరణ రెట్టింపు అవుతోందన్నారు.


ఎలక్ట్రికల్ వాహనాల షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చిలకలగూడ: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. చిలకలగూడ మైలార్‌గడ్డకు చెందిన కిరణ్‌బాబు(38) మినరల్ వాటర్ బ్యాటిళ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చిన కిరణ్ ఆకలేస్తుంది అని చెప్పి గదిలోకి వెళ్లాడు. లోపల నుంచి తలుపులు పెట్టుకుని, సీలింగ్ ఫ్యానుకు లుంగీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఎంత కొట్టినా తలుపులు తీయలేదు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు కిరణ్‌బాబు గతంలో ఓ టీవీ చానెల్‌లో పనిచేసినట్లు తెలిసింది. భార్య రేణుకతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, గురువారం గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

హౌసింగ్ సొసైటీ ఎన్నికలకు భద్రత కల్పించండి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–70లోని జర్నలిస్ట్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు ఈ నెల 18వ తేదీన ఉదయం 9 గంటల నుంచి జరుగుతాయని, ఇందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ కె. రాజేందర్‌రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. మొత్తం 1389 మంది సభ్యులు ఉన్నారని, అదే రోజు సాయంత్రం 3 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందని, ఆ తర్వాత ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని, అప్పటి వరకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఇలాగైతే నడిచేదెలా..!

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్‌కు వెళ్లే రోడ్డులో పార్కింగ్ స్థలాన్ని ఆనుకుని ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన స్తంభాలు పాదచారులకు అడ్డంకిగా మారుతున్నాయి. ఇక్కడే కడక్ చాయ్, 1980 మిలటరీ హోటల్ కూడా ఉండగా, కేబీఆర్ పార్క్‌కు నిత్యం వందలాదిమంది పాదచారులు వస్తుంటారు. అయితే ఈ ఫుట్‌పాత్‌పై గోతులు, స్తంభాలు, పైకి తేలిన ఇనుప చువ్వలు ఉండటంతో పాదచారులు నడిచే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తొలగిస్తే ఈ ఫుట్‌పాత్‌లు అందంగా మారడంతోపాటు పాదచారులు నడవటానికి సులభంగా ఉంటుందని పలువురు వాకర్లు పేర్కొంటున్నారు.

గంగాధర్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి


అభివాదం చేస్తున్న మాదిగ సంఘాల నాయకులు

పంజగుట్ట: సంచార కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలు పడి డీఎస్పీ స్థాయికి ఎదిగిన మదనం గంగాధర్‌కు కరీంనగర్, అదిలాబాద్, నిజామాబ్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున అవకాశం కల్పించాలని మాదిగ, మాదిగ ఉపకులాల సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఎమ్‌ఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు ఇటిక రాజు మాదిగ, 57 ఎస్సీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు చింతల రాజలింగం, మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకులు జున్ను కనకరాజ్‌లు మాట్లాడుతూ మాదిగ ఉపకులాల, సంచారజాతికి చెందిన కుటుంబంలో పుట్టిన మదనం గంగాధర్ చిన్నతనం నుంచి పేపర్‌బాయ్‌గా, కుటుంబ సభ్యులు బొమ్మలు, బుడగలు అమ్మితే వారికి సాయంగా ఉంటూ ఎంతో కష్టపడి చదువుకుని ఎస్సై ఉద్యోగం సంపాదించాడని తెలిపారు. ఇంకా సర్వీస్ ఉన్నప్పటికీ డీఎస్పీగా పదవీ విరమణ చేసి పట్టభద్రుల ఎమ్మెల్సీగా ప్రజలకు మరింత సేవ చేయాలని ముందుకు వస్తున్నాడని ఆయనకు మాదిగ, మాదిగ ఉపకులాల సంఘాలు అన్ని సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో పార్టీలు ఆయనను తమ పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్న ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీవైపు చూస్తున్నారని ముఖ్యమంత్రి స్పందించి కాంగ్రెస్ తరఫున పట్టభద్రుల అభ్యర్థిగా గంగాధర్‌ను ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎమ్‌ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలరాజు, యాదయ్య, బాలకృష్ణ, తులసీరామ్, శంకర్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ది పర్పుల్ పాప్ అప్' ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పైడి రాకేష్ రెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–10 బీబీ లాన్‌లో ది పర్పుల్ పాప్ అప్ పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ నగర యువతను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ చేతి వృత్తుల కళాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు దోహదపడతాయన్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన భిన్నమైన వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శించినట్లు నిర్వాహకులు పైడి సుచరిత రెడ్డి, శ్రీజ తెలిపారు. ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న డిజైనింగ్ విద్యార్థుల ఉత్పత్తులను సైతం ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని గుండా ఈశ్వర్ ఫౌండేషన్, పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ల ద్వారా పేద విద్యార్థుల విద్య, వైద్యం కోసం ఖర్చు చేయనున్నట్లు వారు తెలిపారు. ఓవైపు వ్యాపారం చేస్తూనే మరోవైపు సామాజిక బాధ్యతను చేపడుతున్నామని పేర్కొన్నారు. అంకాపూర్‌కు చెందిన ఆర్గానిక్ మసాలాలు తామే స్వయంగా తయారు చేయించి నగరవాసులకు అందుబాటులో ఉంచినట్లు పైడి సుచరిత రెడ్డి తెలిపారు.

డ్రైవర్లకు భద్రత కల్పించండి


వినతిపత్రం సమర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

బంజారాహిల్స్: మరణించిన ఆటోడ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు సామాజిక భద్రత బీమా పథకం రెన్యువల్‌తోపాటు, వారి కుటుంబాలకు అందించే రూ.5 లక్షలను రూ.10 లక్షల వరకు పెంచాలని ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు దయ్యాల దాసు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, అలాగే సహజ మరణం పొందిన వారి కుటుంబాలకు కూడా ఈ పథకం వర్తింపజేయాలన్నారు. ప్రమాదంలో అంగవైకల్యం చెందిన డ్రైవర్లకు రూ. 3 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీ గోదా మల్లేష్‌గౌడ్, దయానంద్, వెల్తూరి అశోక్, మంద వెంకట్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటి సంరక్షణకు చర్యలు

సుల్తాన్ ఉల్ ఉలూం సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్

బంజారాహిల్స్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వర్షం నీటిని ఒడిసి పట్టుకోవడం చాలా ముఖ్యమని, భూగర్భ జలాలు పెంచుకోవడానికి పలు పద్ధతులు ఎంతో దోహదం చేస్తాయని సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ అన్నారు. గురువారం కళాశాలలో వాటర్‌షెడ్ సపోరా సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ (వాసన్) సంస్థతో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ ఇంకుడు గుంతల ఏర్పాటు, వాటర్ మేనేజ్‌మెంట్, వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాలపై అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా జాఫర్ జావెద్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవడానికి అత్యాధునిక విధానాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వర్షపు నీటి సంరక్షణకు పలు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ డైరెక్టర్ ఎంవి. రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.